సాక్షి నిజామాబాద్

బుధవారం । 9 । జూలై । 2025



10 సబ్‌స్టేషన్ల నిర్మాణం

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు జిల్లాలో రూ. 60 కోట్లతో కొత్తగా 10 సబ్ స్టేషన్‌లను నిర్మిస్తున్నట్లు ఎస్‌ఈ తెలిపారు.

- 8లో ▸



భోజన ఏజెన్సీలకు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 28.5 /23.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణమోహన్

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కృష్ణ మాలకొండారెడ్డి



డాక్టర్ కృష్ణ మోహన్

నిజామాబాద్‌నాగారం : ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కృష్ణమోహన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కృష్ణ మాలకొండారెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్వరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జనరల్ సర్జన్‌గా, ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించిన కృష్ణమోహన్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ఈనెల 10వ తేదీన ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఉస్మానియా మెడికల్ కళాశాలలో కార్డియాలజిస్ట్, ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణ మాలకొండారెడ్డిని జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. గత 12ఏళ్లుగా జీజీహెచ్‌కు రెగ్యులర్ సూపరింటెండెంట్ లేరు. ప్రస్తుతం రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా మాలకొండారెడ్డిని నియమించినప్పటికీ ఆయన బాధ్యతలు తీసుకుంటారా? లేదా? అనేదానిపై చర్చ సాగుతోంది.

సీపీని కలిసిన ఎస్సైలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని మొదటిసారి బాధ్యతలు తీసుకున్న ఎస్సైలు సీపీ సాయి చైతన్యను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కలు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను అమలు చేయాలని, ప్రతి విషయం తమ పైఅధికారులకు తెలపాలని చెప్పారు. ప్రధానంగా సైబర్ నేరాలు, కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీపీని కలిసిన వారిలో ఎస్సైలు ఎమ్ కళ్యాణి, జెడ్ సుస్మిత, ఎమ్ రమా, కే శైలెంధర్, సుహాసిని, పీ రాజేశ్వర్, కిరణ్ పాల్ ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 5,201 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 323 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1067.60(19.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజున 1061.5 (11.96 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.


అమర్‌నాథ్ యాత్రలో ఇందూరు జిల్లా బృందం



జై అమర్‌నాథ్..

- సైన్యం మీద అపారమైన నమ్మకంతో కశ్మీర్ యాత్రకు జిల్లా వాసులు
- మంచులింగాన్ని దర్శించుకున్న జిల్లా యాత్రికులు
- పహల్గామ్ ఘటనతో బెదిరేది లేదంటున్న శివయ్య భక్తులు





కశ్మీర్‌లో దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భూతల స్వర్గంగా పేరుపొందిన కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మన పర్యాటకులపై దాయాది దేశం ఉగ్రమూకలు దాడికి పాల్పడితే భారత ప్రభుత్వం, సైన్యం స్పందించిన తీరుపై యావత్ దేశం గర్వంతో ఉప్పొంగింది. భారత ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలిచారు. పహల్గామ్ మారణహోమం తమను ఏమాత్రం భయపెట్టలేదని ప్రపంచానికి చాటిచెబుతున్నారు.

ఆర్టికల్ 370 రద్దు తరువాత పర్యాటక రంగ అభివృద్ధితో ఆర్థికంగా స్వావలంబన సాధిస్తున్న కశ్మీర్‌లో ఆధ్యాత్మిక, సాధారణ పర్యాటకానికి దన్నుగా నిలబడుతున్నారు. ఇందూరు జిల్లా వాసులు సైతం కశ్మీర్ పర్యటకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా నుంచి అమర్‌నాథ్ యాత్ర, కశ్మీర్ యాత్ర కోసం ఇప్పటి వరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి 124 మంది మెడికల్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఇంకా మరికొందరు ఈ సర్టిఫికెట్లు తీసుకునే పనిలో ఉన్నారు. జిల్లా నుంచి పలువురు బృందాలుగా వెళుతున్నారు. మరోవైపు సిద్ధిపేటకు చెందిన అమర్‌నాథ్ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో యాత్ర మార్గంలో అన్నదానం చేస్తున్నారు. ఈ అమర్‌నాథ్ సేవాసమితిలో నిజామాబాద్ జిల్లా వాసులు సభ్యులుగా ఉన్నారు.

“ ఎప్పటికీ మరిచిపోలేము



అమర్‌నాథ్ యాత్రలో భాగంగా కశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయాన్ని కూడా దర్శించుకున్నాం. పహల్గామ్ దాడి తరువాత ప్రజలు భయపడకుండా అమర్‌నాథ్ యాత్రకు తరలివస్తున్నారు. భారత ప్రభుత్వం, భారత సైన్యం మీద ఉన్న అపార విశ్వాసానికి ఇది నిదర్శనం. యాత్ర కోసం భారత ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు, కల్పించిన భద్రత అత్యద్భుతంగా ఉన్నాయి. అమర్‌నాథ్ యాత్ర పొడవునా సైన్యం అడుగడుగునా పహారా కాస్తోంది. దీంతో ఏమాత్రం భయం లేకుండా ప్రశాంతంగా యాత్ర చేయొచ్చు. భయం అనేదే లేకుండా యాత్ర చేయొచ్చు. కశ్మీర్ అందాలు చాలా అద్భుతంగా ఉన్నాయి. ప్రకృతి అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రకృతి కూడా ప్రస్తుతం పూర్తి అనుకూలంగా ఉంది. జూలై, ఆగస్టులో సందర్శిస్తే అద్భుతంగా ఉంటుంది. అమర్‌నాథ్ యాత్రలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఉచితంగా అందిస్తున్నారు. దక్షిణ భారత, తెలుగు లంగర్లు చాలా ఉన్నాయి.

– కరుటూరి పాపారావు, వెంకట సుబ్బలక్ష్మి, జైతాపూర్

“ బలగాలు గైడ్ చేస్తున్నాయి



అమర్‌నాథ్ యాత్రలో భారత సైనికులు చక్కగా గైడ్ చేస్తున్నారు. మర్యాద పూర్వకంగా, స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తున్నారు. ఇబ్బందులేమైనా ఉంటే అడుగుతున్నారు. కశ్మీర్‌లో చాలా చోట్ల రోడ్లు, వంతెనల నిర్మాణాలు తుది దశకు వచ్చాయి. టన్నెల్స్ సైతం ప్రారంభమయ్యాయి. తెలుగు వారు చాలామంది ఉన్నారు. మేము పదిమంది బృందంగా నిజామాబాద్ నుంచి వెళ్లాం. శ్రీనగర్‌లో దాల్ సరస్సు చాలా బాగుంది. వంతెనలు, రోడ్లు పూర్తి అయితే మరింత తక్కువ సమయంలో యాత్ర పూర్తి చేయొచ్చు.

వడ్డి జనార్దన్ రెడ్డి, వరలక్ష్మి, నవీపేట

“ యాత్రలో అనేక అనుభూతులు..



మా బృంద సభ్యులం ఢిల్లీలో దిగి యాత్ర ప్రారంభించాం. అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం, పాకిస్తాన్ సరిహద్దులో వాఘా బోర్డర్‌ను సందర్శించడం సంతోషంగా ఉంది. వైష్ణోదేవి, అమర్‌నాథ్ ఆలయం, శ్రీనగర్ అందాలు చాలా బాగున్నాయి. తిరుగు ప్రయాణంలో హర్యానాలోని కురుక్షేత్రను సందర్శిస్తాం. – బి సుబ్బారెడ్డి ధనలక్ష్మి, నిజామాబాద్

“ మొదటిసారి అమర్‌నాథ్, మానస సరోవరం యాత్రకు..



ప్రతిఏటా అయ్యప్ప మాల వేస్తున్న ఎనిమిది మంది బృందంతో కలిసి మొదటిసారి అమర్‌నాథ్ యాత్రకు వందేభారత్ రైలులో వెళుతున్నాం. ఇప్పటి వరకు మా బృందం నాలుగు సార్లు శబరిమలకు పాదయాత్ర చేసింది. గత ఏడాది కాశీ నుంచి శబరిమల, రామేశ్వరం వరకు పాదయాత్ర చేశాం. 30 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్నా. మొదటిసారి ఈ నెల 16న అమర్‌నాథ్ యాత్రకు వెళుతుండడం సంతోషంగా ఉంది. మానస సరోవరం యాత్రకు కూడా వెళుతున్నాం. – ధాత్రిక రతన్, నిజామాబాద్

జోహార్ వైఎస్సార్..




సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ఊరూరా ప్రజలు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ హయాంలో అమలు చేసిన పథకాలు, ఆయన సేవలను కొనియాడారు.

స్థానికంగానే సర్దుబాటు

- విధులు నిర్వర్తిస్తున్న మండలం పరిధిలోనే టీచర్ల సర్దుబాటు
- కసరత్తు చేస్తున్న ఎంఈవోలు
- ఈ నెల 15 తరువాత ఉత్తర్వులు
- తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలంటున్న సంఘాలు



నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. విధులు నిర్వర్తిస్తున్న మండలం పరిధిలోనే టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఎంఈవోలకు పూర్తి బాధ్యతలను అప్పగించారు. ఈ నెల 15 తర్వాత ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. 235 ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటుకు అవకాశం ఉంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను ముందుగా వారు పని చేస్తున్న మండల పరిధిలో ఆ తరువాత సమీప మండలానికి సర్దుబాటు చేయాలి. పరస్పర బదిలీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు, 60 మందిలోపు ఉన్న చోట ఇద్దరు, 90 లోపు ఉన్నచోట ముగ్గురు, 120 మంది లోపుఉన్న చోట నలుగురు, 150 మంది వరకు విద్యార్థులు ఉన్న చోట ఐదుగురు, 200లోపు విద్యార్థులు ఉంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. 200 దాటిన తర్వాత ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సర్దుబాటు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ జూన్ మొదటి వారంలోనే పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ.. 'బడిబాట' కారణంగా నెలరోజులపాటు వాయిదా వేశారు. బడిబాట తరువాత నూతన ప్రవేశాలు, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులు లేక గత కొన్నేళ్లుగా మూతపడిన 36 పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే మూడు పాఠశాలలను ప్రారంభించారు. ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులను అదే మండలం లేదా సమీప మండలం నుంచి సర్దుబాటు చేయనున్నారు.

ఉపాధ్యాయ సంఘాల అసంతృప్తి

ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 60 మంది లోపు విద్యార్థులు ఉన్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారని పేర్కొన్నారని, ఇది ఆచరణలో సాధ్యం కాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులు ఇద్దరు టీచర్లు ఎలా బోధిస్తారని, విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. బోధనతోపాటు అనేక రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, దానికే ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాల్సి ఉంటుందంటున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, అవసరమైతేనే టీచర్లను సర్దుబాటు చేయాలని కోరుతున్నారు.

“ టీచర్లపై ఒత్తిడి పడుతోంది..



తరగతికి ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేస్తే టీచర్లపై ఒత్తిడి పడుతుంది. బోధనతోపాటు ఆన్‌లైన్ పనులు కూడా ఉంటాయి. విద్యాబోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. – కేశపురం రమేశ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

బోధనపై ప్రభావం ఉండొద్దు



60 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలకు ముగ్గురు టీచర్లను కేటాయించాలి. టీచర్ల సర్దుబాటు విద్యాబోధనపై ప్రభావం చూపొద్దు. టీచర్లకు బోధనేతర పనులు కేటాయించొద్దు. అయితేనే ప్రాథమిక పాఠశాలల్లో ఇబ్బందులు ఉండవు. – పీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు



బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం

సబ్‌కలెక్టర్ కార్యాలయ జప్తునకు ఆదేశం

వర్ని: వ్యవసాయ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని బోధన్ సీనియర్ సివిల్ జడ్జి కాంచనరెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉమ్మడి వర్ని మండలంలోని లక్ష్మీసాగర్ ప్రాజెక్టులో 155 ఎకరాల భూములు కోల్పోయిన 105 మంది రైతులకు రూ.62 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. 1986లో లక్ష్మీసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో కారేగాం, మేడిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల పరిధిలోని 105 మంది రైతులకు చెందిన 155 ఎకరాల వ్యవసాయ ముంపునకు గురైంది. సదరు రైతులు కోర్టును ఆశ్రయించగా రూ.56 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని 2022లో హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే ఆ తీర్పు ఇప్పటి వరకు అమలు కాలేదు. రైతులు తిరిగి స్థానిక సివిల్ కోర్టుకు వెళ్లగా రూ.56 లక్షలకు వడ్డీ కలుపుకుని మొత్తం రూ.62 లక్షల పరిహారాన్ని రైతులకు చెల్లించాలని.. లేనిపక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.


“ ఫైల్ పెండింగ్‌లో ఉంది

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించిన ఫైల్‌ను నాలుగు నెలల క్రితం జిల్లా కలెక్టర్‌కు పంపించాం. ఇరిగేషన్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రెటరీ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిహారం విడుదల కాగానే రైతులకు చెల్లిస్తాం.

– వికాస్ మహతో, సబ్ కలెక్టర్, బోధన్

ప్రభుత్వం వద్ద మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది లేదు
- ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చాలన్నదే లక్ష్యం
- నగరవాసులు సహకరించాలి
- కుక్కల బెడదను నివారిస్తాం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్



నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది లేదని, నిబంధనలను పాటించని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ దిలీప్‌కుమార్ స్పష్టం చేశా రు. నగరంలో తాగునీరు, డ్రైయి నేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, భవన నిర్మాణ అనుమతులు తదితర సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం 'ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించగా.. కమిషనర్ పాల్గొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30గంటల వరకు సుమారు 52 మంది నగరవాసులు ఫోన్ చేసి వివిధ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామని, ప్రతిరోజూ చెత్త సేకరణ ఉంటుందని, కుక్కల బెడదను నివారిస్తామని కమిషనర్

✤ వినాయక్‌నగర్‌లోని అమ్మ వెంచర్ పరిసరాలు అధ్వానంగా మారాయి. దారి వెంట పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త సేకరించడం లేదు. రోడ్ల మరమ్మతులు చేపట్టడం లేదు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. మధుసూదన్ (అమ్మ వెంచర్), వేణుకుమార్(ఎల్లమ్మగుట్ట)

■ **మున్సిపల్ కమిషనర్:** వీధిలైట్ల మెయింటెనెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఏజెన్సీకి అప్పగించింది. త్వరలోనే లైట్లు ఏర్పాటు చేస్తాం. చెత్త సేకరణ రోజూ జరిగేలా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశిస్తాం.

✤ వినాయక్‌నగర్ బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద రోడ్డు పనులు నెలలుగా సాగుతున్నాయి. కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. బోసుబాబు (వినాయక్‌నగర్), సాయిబాబు (కెనాల్ కట్ట)

■ సంబంధిత ఏఈని పంపి పనులు వేగవంతం చేయాలని ఆదేశిస్తాం. కాలనీవాసులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం. కుక్కలు పట్టేవారిని ఈ రాత్రి పంపిస్తాం.

✤ నగరంలోని నాల్గో డివిజన్ పరిధిలో ఉన్న పాంగ్రా, మాధవనగర్, మూడో డివిజన్‌లోని గూపన్‌పల్లి, గంగాస్థాన్–2, వీరభద్రకాలనీల్లో పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీలు తీయడం లేదు. ఖానాపూర్ భాగ్యనగర్ కాలనీలో ఇళ్ల మధ్య మురికినీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు సరిగా చెత్త తీసుకెళ్లడంలేదు. డీఎస్ మార్కెట్ ఎదురుగా ఉన్న గల్లీలు అధ్వానంగా మారాయి.

సాలుగారి మోహన్ (ఖానాపూర్), రాములు (పాంగ్రా), రతన్ (47 డివిజన్), నాగభూషణం (ఆర్టీసీ కాలనీ)

■ ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్, షాదుల్లాతోపాటు శానిటరీ సూపర్ వైజర్ సాజిద్ అలీతో మాట్లాడుతా. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తా.

✤ యాదగిరిబాగ్‌లో ప్రభుత్వ స్థలం కబ్జాచేస్తున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. కబ్జాదారులను ప్రోత్సహించొద్దు.. ప్రభుత్వ స్థలాలను కాపాడాలి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. భూమేశ్వర్ గుడ్ల (యాదగిరిబాగ్), శ్రీనివాస్‌గౌడ్ (వినాయక్‌నగర్)

■ మున్సిపల్ రోడ్డు కబ్జాపై ఫిర్యాదు అందింది. టౌన్‌ప్లానింగ్ అధికారులను పంపించి పనులు నిలిపివేయించాం. తిరిగి పనులు చేస్తే ఈసారి కేసు నమోదు చేస్తాం. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీచేస్తాం.

✤ కాలూర్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఓ నాయకుడు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడు. దీనిపై ఫిర్యాదు చేసినా ఖాతరు చేయడం లేదు. కఠిన చర్యలు తీసుకోవాలి. గంగాధర్ (కాలూర్), శ్రీనివాసులు (కాలూర్)

■ వెంటనే పనులు నిలిపివేయిస్తాం. టౌన్‌ప్లానింగ్ అధికారులను పంపిస్తాం. మళ్లీ పనులు చేపడితే సమాచారం ఇవ్వండి. ఈ సారి నేనే వచ్చి చూస్తా.

✤ ఇంటింటికి చెత్త బండి రోజూ రావడం లేదు. డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. తీసిన చెత్తను తరలించడం లేదు. కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. మహేశ్ (మమ్మదేవీ కాలనీ), అబ్దుల్‌నయీం ఖాన్ (ఖిల్లా చౌరస్తా), రాజులదేవి శంకర్ (గాజుల్‌పేట్), రజిని (ఆనంద్‌నగర్‌కాలనీ), గులాబ్ సింగ్ (ఫారెస్ట్ ఆఫీస్ వెనక ప్రాంతం), మోహన్ (పవర్‌హౌస్)

■ ఇంటింటి చెత్త సేకరణ రోజూ జరగాల్సిందే. డ్రెయినేజీల్లో నుంచి తీసిన చెత్తను కూడా తొలగిస్తారు. ఈ మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశిస్తా. కుక్కలను పట్టే కార్యక్రమం కూడా పూర్తి స్థాయిలో చేపడతాం.

✤ ఆక్రమణలను బల్దియా అధికారులే ప్రోత్సహిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా స్పందించడం లేదు. మాస్టర్ ప్లాన్ ఖచ్చితంగా అమలు చేయాలి. ఖలీల్‌వాడి, బోధన్ రోడ్డు, హైదరాబాద్ రోడ్‌లలో ఆక్రమణలను తొలగించాలి. పాతనగరంలో పార్కులు లేవు. హైదరాబాద్ రోడ్డులో ఇటీవల విచ్చలవిడిగా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇస్తున్నారు. ఇందులో టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారం కూడా ఉంది. సయ్యద్ ఖైసర్ (పులాంగ్), కోర్వ దేవేందర్ (ఎల్లమ్మగుట్ట), శివాజీ భూషణ్ (శ్రీనగర్ కాలనీ), గంగాధర్ (వర్ని చౌరస్తా)

■ మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ పూర్తిచేసి ప్రభుత్వానికి పంపించాం. ముఖ్యమంత్రి కార్యాలయం అనుమతి ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించబోము. ట్రాఫిక్ ఫ్రీగా సిటీగా మార్చాలన్నదే మా లక్ష్యం. నగరవాసులు సహకరించాలి. నిబంధనలను పాటించని నిర్మాణాలకు అనుమతులు ఇవ్వం.

✤ కోటగల్లిలోని సరస్వతి శిశుమందిర్ వెనుకభాగంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఖాళీ స్థలంలో మురికి నీరు నిలుస్తోంది. పాములు, తేళ్లు, విషపురుగులు పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎన్నిసార్లు శానిటరీ జవాన్‌లకు, ఎస్సై సునీల్‌కు చెప్పినా మా పరిధి కాదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

డాక్టర్ శ్రీనివాస్ (కోటగల్లి), గోపినాథ్ (గోల్‌హనుమాన్), మాయావర్ సావిత్రి (కోటగల్లి)

■ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిందే. వెంటనే స్పెషల్ టీమ్‌తో శుభ్రం చేయిస్తా. సంబంధిత ఎస్సై, శానిటరీ సూపర్‌వైజర్‌ను పంపిస్తాం.

క్లుప్తంగా

'బీఏఎస్' బిల్లులు చెల్లించాలి

- సీఎంకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ డిమాండ్

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్(బీఏఎస్) స్కీం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం మెయిల్ ద్వారా లేఖ పంపించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు విన్నవించారు. ఈ సందర్భంగా దినేశ్ పటేల్ కులాచారి మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ స్కీం బిల్లులు దాదాపు రూ.200 కోట్ల మేర చెల్లించకపోవడంతో యాజమాన్యాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని స్కూళ్ల స్కీం ద్వారా చదువుతున్న విద్యార్థులను రావొద్దని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రుద్రూర్/కోటగిరి: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా మలేరియా వైద్యాధికారి తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రుద్రూర్ ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. మిర్జాపూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. కోటగిరిలో ఇటీవల డెంగీ వచ్చిన వారి ఇంటిని పరిశీలించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్షించారు. ఆయన వెంట మండల వైద్యాధికారిణి ఆయేషా సిద్దిఖీ, గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్లు రవి, సునీత, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఊర పండుగకు అంకురార్పణ

- గాజుల్‌పేట్‌లో బండారు పోసిన పెద్దలు
- 13న ఊర పండుగ



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఊర పండుగకు అంకురార్పణ జరిగింది. మంగళవారం సర్వసమాజ్ కమిటీ, శ్రీ విజయ్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నగరంలోని గాజుల్‌పేట్ వీధిలో బండారు పోశారు. ఈ సందర్భంగా సర్వసమాజ్ కమిటీ కో కన్వీనర్ ఆదె ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇందూరు నగరం ఏర్పాటు నుంచి ఊర పండుగ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ జాయింట్ సెక్రటరీలు మల్కాయ్ సుదర్శన్, పసుల రాజు, కార్యవర్గ సభ్యులు కొత్మీర్ సతీశ్, శ్రీ విజయ్ కిసాన్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు సుంకటి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పాల్వంచ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన బాలిక

- చికిత్స పొందుతూ చిన్నారి మృతి



మనస్వి (ఫైల్)

మాక్లూర్: వాటర్ హీటర్ బకెట్లో పడి తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో మూడు నెలలుగా చికిత్స పొందిన బానావత్ మనస్వి (4) మంగళవారం రాత్రి మృతి చెందింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని ఎలియానాయ్ తండాకు చెందిన బానావత్ విజయ్‌కుమార్, కీర్తిల కుమార్తె మనస్వి ఏప్రిల్ 3న ఆడుకుంటూ పక్కింటికి వెళ్లి అక్కడ వాటర్ హీటర్ పెట్టి ఉన్న బకెట్లో పడింది. తీవ్రగాయాలు కావడంతో చిన్నారిని నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సురక్ష ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, డాక్టర్ సూచన మేరకు ఇటీవలే డిశ్చార్జీ అయ్యింది. మంగళవారం చిన్నారి ఆకస్మికంగా మరణించిందని ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భోజన ఏజెన్సీలకు బకాయిల భారం

- బిల్లుల చెల్లింపులలో సర్కారు నిర్లక్ష్యం
- జిల్లాలో దాదాపు రూ.5.93 కోట్లు పెండింగ్



మోర్తాడ్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బకాయిలు పేరుకపోవడంతో ఇంకెంత వరకు అప్పులు చేయాలని ప్రశ్నిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలను పెంచిన ప్రభుత్వం వారికి క్రమం తప్పకుండా నిధులను కేటాయిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని ఏజెన్సీలకు మాత్రం నెలల తరబడి బిల్లులను చెల్లించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి అక్టోబర్ నుంచి ఫిబ్రవరి 2025 వరకూ తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన బిల్లులతోపాటు అన్ని తరగతుల విద్యార్థులకు కోడిగుడ్లు వడ్డించిన బిల్లులు, గౌరవ వేతనం బకాయిలు రూ.1.43 కోట్ల వరకూ ఉన్నాయి. గడిచిన మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి రూ.3 కోట్లు, 2025–26 విద్యా సంవత్సరంలోని బిల్లు బకాయి మరో రూ.1.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని 1124 ఏజెన్సీలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా బిల్లు చెల్లించాలంటే రూ.1.50 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఏజెన్సీల నిర్వాహకులు పేద, మధ్య తరగతికి చెందినవారే కావడంతో విద్యార్థులకు భోజనం పెట్టాలంటే అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడం, దుకాణాదారుల వద్ద తీసుకున్న సామగ్రి డబ్బులు చెల్లించకపోవడంతో కొత్తగా ఉద్దెర ఇవ్వమని ఘాటుగా సమాధానం చెబుతున్నారని బాధపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లు బకాయిలు వెంటనే చెల్లించాలి. ఏజెన్సీలు ఎన్నో కష్టాలు పడుతున్నాయి. బిల్లులు చెల్లించకపోతే ఏజెన్సీల నిర్వాహకులతో కలిసి ఆందోళన తీవ్రతరం చేస్తాం.

– చక్రపాణి, సీఐటీయూ నాయకుడు

పకడ్బందీగా స్నాతకోత్సవ ఏర్పాట్లు

తెయూ వీసీ యాదగిరిరావు



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 16న జరిగే రెండో స్నాతకోత్సవానికి పకడ్బందీ ఏర్పాటు చేయాలని వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు స్పష్టం చేశారు. 12 సంవత్సరాల తర్వాత రెండో స్నాతకోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ఏర్పాట్లు బాగుండాలన్నారు. స్నాతకోత్సవానికి హాజరయ్యే విద్యార్థులు, పరిశోధకులు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పించాలన్నారు. 2014 నుంచి 2023 వరకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో వివిధ విభాగాల నుంచి మొదటి ర్యాంకు పొందిన 180 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ తోపాటు 30 జూన్ 2025 వరకు వివిధ విభాగాలలో పరిశోధనలు పూర్తి చేసుకున్న సుమారు 158 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేస్తారని వీసీ తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఎంయాదగిరి, కంట్రోలర్ సంపత్ కుమార్, కమిటీ కన్వీనర్లు ఘంటా చంద్రశేఖర్, కనకయ్య, అపర్ణ, ఆరతి, రాంబాబు, ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ మామిడాల ప్రవీణ్, నాగరాజు, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా నారాయణ



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మైసల నారాయణను మంగళవారం ఎన్నుకున్నారు. నగరంలోని ఖలీల్‌వాడిలో జిల్లా పద్మశాలి సంఘ కార్యవర్గ సమావేశం గౌరవ అధ్యక్షుడు, అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్ బోర్డు సభ్యుడు దాసరి నర్సింలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా రిటైర్డ్ తహసీల్దార్ మైసల నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకొని ఘనంగా సన్మానించారు. అనంతరం నారాయణకు జిల్లా అనుబంధ సంఘాల ప్రతినిధులు, నగరంలోని వివిధ తర్పలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రతినిధులు బీమర్తి రవి, గాలిపల్లి నారాయణ, పాము రమేశ్, గెంటెల వెంకటేశ్(బొట్టు), కోడూరు స్వామి, సిరిగాదే మనోహర్, ఆడెపు రాజన్న, రచ్చ మురళి, సామల శ్రీనివాస్, దిండిగల్ల శంకర్, భాస్కర్, జీజీ ప్రసాద్, పద్మసుభాష్, పెంబర్తి సంతోష్‌కుమార్, శేరుపల్లి బాగులరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్



నిజామాబాద్ సిటీ: మాజీ సీఎం, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి జిల్లాతో ఎంతో అనుబంధం ఉందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో వైఎస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ వైఎస్‌కు జిల్లాతో అవినాభావ సంబంధం ఉందని, ఆయన జన్మదినం నిజాంసాగర్‌లో జరుపుకున్నామని గుర్తుచేశారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ తదితర పథకాలు విజయవంతంగా అమలుచేసిన ధైర్యవంతుడైన నాయకుడన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆయన శిష్యుడేనన్నారు. వైఎస్ ఆశయాలను సీఎం రేవంత్ రెడ్డి ముందుకు తీసుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నాయకులు కెతావత్ యాదగిరి, వేణు, కోనేరు సాయికుమార్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వ చేయూత

- నిర్మాణానికి డ్వాక్రా రుణాలు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలతోపాటు ఇసుకను ఉచితంగా అందిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం చేయూతనిస్తుందని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు డ్వాక్రా రుణాలు ఇప్పించి, ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. మంగళవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి బల్దియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై సాధించిన ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని, చిత్తశుద్ధితో పనిచేసి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన ప్రొసీడింగ్స్ అందించాలని సూచించారు. అనంతరం పాండుఫారంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి తుకారాం రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బల్దియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల సేకరణలో జాప్యాన్ని నివారించాలి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రజోపయోగ పనుల కోసం అవసరమైన స్థల సేకరణలో జాప్యానికి తావులేకుండా ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం స్థల సేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గతవారం నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాల అమలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. రోడ్ల నిర్మాణాలు, విస్తరణతోపాటు నూతన విద్యా సంస్థలు, వసతి గృహాలు, వైద్యశాలలు, మహిళాశక్తి భవనాలు వంటి వాటికి సొంత భవనాల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను సకాలంలో అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని, ఇతర శాఖలతో సంప్రదింపులు జరుపుతూ త్వరితగతిన స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. స్థల సేకరణలో పరిహారం ఖరారైన వాటికి చెల్లింపులు కూడా వెంటనే జరిగేలా చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, మెప్మా పీడీ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పొలం పనులు చేస్తూ ఒకరి మృతి



బస్వయ్య మృతదేహం

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంపునకు చెందిన గెంట్యాల బస్వయ్య (38) మంగళవారం పొలంలో పనిచేస్తూ మృతి చెందాడు. ఉదయం గ్రామానికి చెందిన ధరావత్ జగ్రామ్ పొలంలో వరాలు చేయడానికి కూలీకి వెళ్లాడు. పని చేస్తుండగా కాలు జారి బోర్లా పడటంతో ముఖం బురదలో కూరుకుపోయింది. దీంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఆర్ కాలనీలో దొంగల బీభత్సం

- 16 తులాల బంగారం చోరీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామ పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గురురాఘవేంద్ర కాలనీలో నివాసముండే ప్రభుత్వ ఉద్యోగి దేవరాజు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. తిరిగి సోమవారం వచ్చి చూడగా ఇళ్లంతా గందరగోళంగా ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. బీరువాలో ఉన్న 16 తులాల బంగారు నగలు, రూ.60వేలు చోరీకి గురైనట్లుగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ముగ్గురు దుండగులు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి పక్కాగా చోరీకి పాల్పడినట్లు తెలిసింది.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ సీఐ బూస శ్రీనివాస్ తెలిపారు. నాగారంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన సాలంకే రత్నదీప్ గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. 15 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- తప్పిన ప్రాణాపాయం



ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో ముందు ప్రయాణిస్తున్న రెండు కార్లను వెనుక నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి వేగంగా ఢీ కొట్టింది. దీంతో ముందు వెళ్తున్న రెండుకార్లు వరుసగా ఢీకొనడంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ప్రమాదానికి గురైన కారు తగలడంతో బైక్ పై ప్రయాణిస్తున్న కామారెడ్డి జిల్లా ఉత్తునూరు గ్రామానికి చెందిన దంపతులకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడిన వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కాగా, కోతుల గుంపు ఎదురు రావడంతో కార్లను ఆపగా వెనుకాల నుంచి లారీ ఢీకొన్నట్లు పేర్కొన్నారు.

దత్తత తీసుకోబడిన గ్రామమే దత్తాపూర్



దత్తాపూర్ ముఖ చిత్రం

మీకు తెలుసా?

డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామాన్ని దేశ్‌ముఖ్ అనే దొర దత్తత తీసుకొని పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే ఈ గ్రామానికి దత్తాపూర్ అనే పేరు వచ్చినట్లు ఊరి పెద్దలు చెప్తున్నారు. సుమారు 200 ఏళ్ల క్రితం లంబాడీ తండా మాత్రమే ఉండేదని, కాలక్రమేనా గ్రామంగా అవతరించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

- తొండాకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉన్న దత్తాపూర్ 1981లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం 900 ఎకరాల వరకు సాగు భూములు, 395 నివాస గృహాలున్నాయి.
- మొదట్లో తండా ఉండటంతో ఊరిలో లంబాడీ(గిరిజన) కుటుంబాలు 100కు పైగా ఉన్నాయి. అందుకే ఈ ఊరికి మొదటి సర్పంచ్‌గా మూడ్ రామ్‌జీ 1981లో ఎన్నికయ్యారు. 1959లో గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటైంది.
- గ్రామానికి రెండు చెరువులున్నాయి. ఒకటి పెద్ద చెరువు, మరొకటి గ్రామకుంట. పెద్ద చెరువు విస్తీర్ణం 106ఎకరాలు ఉంటుంది. ఉమ్మడి నందిపేట్ మండలంలో కుద్వాన్‌పూర్ చెరువు తర్వాత దత్తాపూర్ పెద్ద చెరువుదే అతి పెద్ద విస్తీర్ణం.
- దత్తాపూర్‌లో దత్తాత్రేయుడికి ఊరంతా భక్తులే. వందేళ్ల క్రితమే శివదత్త గుడిని కట్టారు. అప్పటి నుంచే పూజలు, భజనలు చేస్తున్నారు. ఏటా దత్త జయంతి రోజున (పౌర్ణమి) పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడ ఉన్న ఔదుంబర వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి నిష్ఠతో దత్తుడిని పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల్లో నమ్మకం ఏర్పడింది.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- సీపీ సాయి చైతన్య
- మెగా వైద్య శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: పోలీసులకు విధులు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ప్రధానమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మెగా వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందితోపాటు వారి కుటుంబసభ్యుల ఆరోగ్యంపై అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. వైద్య శిబిరంలో ఆర్‌బీఎస్, కంటి పరీక్ష, ఈసీజీ, 2డీ ఈకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేస్తారన్నారు. ప్రతి సంవత్సరం ఒక్కసారైనా డాక్టర్లను సంప్రదించాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని సిబ్బంది, హోంగార్డులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీసీపీలు బస్వారెడ్డి, రామ్‌చందర్ రావు, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, పీ శ్రీనివాసులు, వెంకటేశ్వర్ రెడ్డి, రిజర్వ్ సీఐలు శ్రీనివాస్, శేఖర్ బాబు, తిరుపతి, సతీశ్, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళ, డాక్టర్లు సుధాకర్ రావు, చంద్రమోహన్, వంశీ, ఆఫ్రిన్, నిఖిత, షాహబాజ్ హైమద్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



వెల్‌నెస్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ పేర్కొన్నారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న వెల్‌నెస్ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్, ఓపీ విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన రోగుల వద్ద నుంచి రక్త నమూనాలను తీసి టీహబ్‌కు పంపాలని సూచించారు. ఆమె వెంట వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

రూ.60 కోట్లతో 10 సబ్‌స్టేషన్ల నిర్మాణం

- జిల్లాలో రూ.40 కోట్ల విద్యుత్ బకాయిలు
- ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్



రెంజల్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్లను ప్రారంభిస్తున్న ఎస్ఈ రవీందర్

రెంజల్(బోధన్): విద్యుత్ వినియోగదారులతోపాటు రైతులకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసేందుకు జిల్లాలో రూ. 60 కోట్లతో కొత్తగా 10 సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ పేర్కొన్నారు. ఇప్పటికే మూడు చోట్ల పనులు ప్రారంభించగా మరో 7 పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. రెంజల్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం అదనంగా మూడు బ్రేకర్లను ప్రారంభించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళికతో కార్యాచరణ జరుగుతుందని వివరించారు. ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించి వాటి స్థానంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్య వచ్చినప్పుడు లోడ్ పడకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 108 బ్రేకర్లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్ 1912ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో రూ. 40 కోట్ల వరకు బకాయిపడిన ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు వెంటనే చెల్లించి సహకరించాలని కోరారు. ఆయన వెంట డీఈఈ వెంకట రమణ, ఏడీఈ తోట రాజశేఖర్, డీఈఈ ముక్తార్, ఏఈ మగ్దుంతోపాటు ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో సాయాగౌడ్

నిజామాబాద్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని, పనిలో పారదర్శకత ఎంతో అవసరమని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్ భవనంలో కారుణ్య నియామకం పొందిన జూనియర్ అసిస్టెంట్లకు సర్వీసు నిబంధనలకు పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో సాయాగౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చట్టం, లోకల్ బాడీపై అవగాహన ఉండాలని అన్నారు. పది రోజులపాటు అకౌంట్స్, జిల్లా పరిషత్ ఎన్నికలు, పే బిల్స్, కార్యాలయ నిర్వహణ, ఆర్‌టీఐ తదితర వాటిపై అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం భాస్కర్, జనరల్ సెక్రెటరీ ప్రదీప్, అసోసియేట్ ప్రెసిడెంట్ శంకర్, వైస్ ప్రెసిడెంట్ సునీతాదేవి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిద్ధు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇష్టారాజ్యం

- మధ్యాహ్నం 12 గంటలు దాటినా విధులకు హాజరుకాని సబ్ రిజిస్ట్రార్లు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

సుభాష్‌నగర్: నగరంలోని నిజామాబాద్ అర్బన్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమ వారం రోజంతా సర్వర్ డౌన్ కావడంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా, మంగళవారం 12 గంటలు దాటినా అధికారులు విధులకు హాజరుకాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యాలయంలో 9 నెలలుగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం ఒక్కరే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఉండగా, ఆయన కూడా మంగళవారం గైర్హాజరయ్యారు. సమాచార లోపంతో 12 దాటినా సబ్ రిజిస్ట్రార్‌గా విధులకు హాజరుకాలేదు. ఈ విషయాన్ని డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు ఉన్నతాధికారులకు తెలపడంతో వారి సూచనల మేరకు ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జీలుగా కొనసాగారు. కాగా, మంగళవారం 44 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది.